క్లుప్తంగా

అర్హులందరూ రక్తదానం చేయాలి


రక్తదానం చేస్తున్న రమణ

శ్రీకాకుళం కల్చరల్: అర్హులందరూ రక్తదానం చేయాలని రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు అన్నారు. శనివారం అత్యవసర పరిస్థితిలో నరసన్నపేటకు చెందిన వి.సూర్యనారాయణకు ఓ పాజిటివ్ రక్తం అవసరం కాగా రెడ్‌క్రాస్‌లో సేవలందిస్తున్న ప్రోగ్రాం మెనేజర్ గొలివి రమణ ముందుకు వచ్చి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా దాత రమణ మాట్లాడుతూ.. ఇప్పటి వరకు 42 సార్లు రక్తదానం చేశానని, 12 సార్లు ఎస్డీపీని అందించానని అన్నారు. మోటివేటర్ ఉర్లం శివతేజ, నంది ఉమాశంకర్, బి.మధు, బి.సతీష్, అయేషా బేగం, నారాయణ, సురేష్, సుమతి, ప్రియాంక, కోమలి, వేంకటేష్ ఉన్నారు.

కాలిబాటలతో అనేక ప్రయోజనాలు

ఎచ్చెర్ల క్యాంపస్: వరిపంటలో కాలిబాటలు వలన అనేక ప్రయోజనాలు ఉన్నాయని ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు శిక్షకుడు సువ్వారి సన్యాసిరావు అన్నారు. జరజాం పంచాయతీ గొలివివానిపేట గ్రామంలోని బట్న సిమ్మన్న పొలంలో కాలిబాటలు వల్ల ప్రయోజనాలపై శనివారం అవగాహన కల్పించారు. తూర్పు, పడమర దిశగా రెండు మీటర్లుకు ఇరవై సెంటీమీటర్లు చొప్పున కాలి బాటలు తీసుకోవాలని చెప్పారు. తెగుళ్ల నియంత్రణ, ఎరువుల వినియోగం, తెగుళ్ల నియంత్రణ మందులు పిచికారీ వంటివి సాధ్యమవుతాయన్నారు. వీఏఏ జగన్‌మోహన్, సిబ్బంది మెట్ట ధనుంజయ్, హరేరామ్ పాల్గొన్నారు.

పరామర్శ

ఎచ్చెర్ల: విశాఖపట్నం అచ్యుతాపురంలో జరిగిన ఘటనలో లావేరు మండలం తాళ్లవలస పంచాయతీ సుభద్రాపురం గ్రామానికి చెందిన కొంద్రు అప్పన్న కుమారుడు కొంద్రు రాంబాబు గాయపడి విశాఖలోని మెడికవర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీంతో వారి కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ శనివారం పరామర్శించారు. ఆయనతో పాటు మండల జేసీఎస్ ఇన్‌చార్జి మీసాల శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి దేశెట్టి తిరుపతిరావు, నాయకులు సిమ్మినాయుడు, శ్రీను తదితరులు ఉన్నారు.

నేడు స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యాలయం ప్రారంభం


పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

శ్రీకాకుళం న్యూకాలనీ: స్థానిక డీఈవో కార్యాలయం సమీపంలో ఉన్న ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల వద్ద ఉన్న ఆర్ఎంఎస్ఏ భవనాన్ని జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యాలయంగా తీర్చిదిద్దారు. ఉన్నతాధికారుల అనుమతితో దీన్ని కార్యాలయంగా మార్చారు. సుమారు రూ.5 లక్షల నిధులతో భవనం వెలుపల, లోపల పనులను, సీలింగ్, ఫాల్స్, పెయింటింగ్ ఇతర పనులను పూర్తిచేసి అత్యద్భుతంగా తీర్చిదిద్దారు. దీన్ని కేంద్రమంత్రి కె.రామ్మోహన్‌నాయుడు ఆదివారం ఉదయం 9.30 గంటలకు ప్రారంభిస్తారని డీఈవో ఎస్.తిరుమల చైతన్య, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ బీవీ రమణ, పీడీ–పీఈటీ సంఘ జిల్లా అధ్యక్షుడు మొజ్జాడ వెంకటరమణ, మెంటాడ సాంబమూర్తి తెలిపారు.

బీజేపీ సభ్యత నమోదు ప్రక్రియ ప్రారంభం


మాట్లాడుతున్న విష్ణుకుమార్‌రాజు

శ్రీకాకుళం న్యూకాలనీ: భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు ప్రక్రియ శనివారం సాయంత్రం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ విశాఖపట్నం నార్త్ ఎమ్మెల్యే పి.విష్ణుకుమారాజు పాల్గొన్నారు. దేశ హితం కోసం పనిచేస్తున్న ఏకైక పార్టీ బీజేపీ మాత్రమే అన్నారు. జిల్లా ఇన్‌చార్జి విజయానందరెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరరావు, రాష్ట్ర అధికార ప్రతినిధి పూడి తిరుపతిరావు, రాష్ట్ర నాయకులు పైడి వేణుగోపాలం, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు శవ్వాన ఉమామహేశ్వరి, పైడి రాజారావు పాల్గొన్నారు.

ఉద్యోగి మృతికి సంతాపం

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో నాన్ టీచింగ్ స్టాఫ్‌గా పనిచేస్తున్న డి.కొండలరావు అనారోగ్యంతో ఆకస్మాత్తుగా శనివారం మృతి చెందారు. మంచి ఉద్యోగిగా పేరు ఉంది. రూ.25 వేలను కుటుంబ సభ్యులకు అంత్యక్రియలు కోసం వీసీ రజినీ అందజేశారు. మృతుని చిత్రపటానికి వర్సిటీ అధికారులు, సిబ్బంది నివాళులర్పించారు.

ఉరే సరి



కలకత్తాలోని ఆర్‌జీ కర్ వైద్య కళాశాలలో జరిగిన ఆటవిక చర్యపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలి. అలాంటి నరరూప రాక్షసులకు ఉరిశిక్ష విధిస్తేనే మిగతావారికి భయం కలుగుతుంది. విధుల్లో ఉన్న వైద్య సిబ్బందిపై దాడిచేస్తే సకాలంలో దర్యాప్తు చేసి, శిక్షలు విధించాలి.

– డాక్టర్ పేకల సుమబిందు,
పీహెచ్‌సీ, జి.సిగడాం

వైద్యులకు రక్షణ కల్పించాలి



మారుమూల పల్లెల్లో వైద్య సేవలను అందిస్తున్న మహిళా వైద్యులందరికీ ప్రత్యేక రక్షణ కల్పించాలి. వీరితోపాటు వృత్తిలో పనిచేస్తున్న ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలకు ప్రభుత్వం భరోసా ఇవ్వాలి. అప్పుడే రోగులకు సరైన వైద్యం అందుతుంది. విధుల్లో ఉన్న మహిళా వైద్యులకు ప్రత్యేక రక్షణ ప్రభుత్వం కల్పించాలి. దాడులు చేసిన వ్యక్తులకు కఠినమైన శిక్ష వేయాలి.

– కెజియా,
మెట్టవలస ఎంఎల్‌హెచ్‌పీ

వక్ఫ్ ఆస్తుల దోపిడీకే చట్ట సవరణలు

- అఖిల పక్ష చర్చావేదికలో పలువురు వక్తలు

శ్రీకాకుళం(పీఎన్‌కాలనీ):

వక్ఫ్ చట్ట సవరణ బిల్లు ముస్లిం మైనార్టీలను బోర్డు నుంచి తొలగించేలా ఉందని, ఆస్తుల దోపిడీకే సవరణలు చేసినట్లు ఉందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. శ్రీకాకుళం నగరంలోని జామియా మసీదులో శనివారం వక్ఫ్ చట్ట సవరణ బిల్లుపై అఖిల పక్ష చర్చావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ముస్లిమేతరులను వక్ఫ్ కమిటీలలో పెట్టాలని, వారికి కూడా హక్కులు కల్పించాలనటంలో కేంద్ర ప్రభుత్వ కపటత్వం బయట పడిందన్నారు. ముస్లింలపై చిత్తశుద్ధి ఉంటే సచార్ కమిటీ నివేదిక, రంగనాథ్ మిశ్రా కమిషన్ సిఫారసులపై పార్లమెంట్‌లో చర్చించి అమలు చేయాలని కోరారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక ముస్లిమ్‌లనే లక్ష్యంగా చేసుకొని వారి ఆర్థిక, సాంఘిక, వాణిజ్య, విద్య, భాష, సంస్కృతిపై భౌతిక దాడులకు దిగుతోందని విమర్శించారు. వక్ఫ్ ఆస్తులను, హస్తగతం చేసుకోవడానికి అనేక కుట్ర పూరిత చర్యలకు కేంద్ర ప్రభుత్వం పూనుకుందన్నారు.

ఇప్పటికే వక్ఫ్ ఆస్తులు, భూములను అధికార పార్టీల నాయకులు కబ్జాలకు పాల్పడలేదా..? అని ప్రశ్నించారు. విభజించు, పాలించు అనే సూత్రాన్ని కేంద్ర ప్రభుత్వం విడనాడాలని, లౌకిక ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కోరారు. వక్ఫ్ అనేది ముస్లిం మైనారిటీల దేవదాయ భూమి అని, ముస్లింలు దైవ సంబంధమైన, సేవాపరమైన పవిత్ర కార్యక్రమాలకి తమ సొంత భూముల్ని ఆస్తులను దానం చేస్తారని తెలిపారు. దేశంలో 9 లక్షల 20వేల ఎకరాలు భూమి వక్ఫ్ కింద ఉందని, దీని విలువ సుమారు లక్ష 20 వేల కోట్ల రూపాయలు ఉంటుందని వివరించారు. ఈ భూములను కాజేసేందుకు కార్పొరేట్లు చట్ట సవరణను వాడుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో బాడాన దేవభూషణరావు, సురంగి మోహనరావు, శ్రీనివాసరావు, గంజి ఆర్.ఎజ్రా, కంత వేణు, గణేష్, పిసిని చంద్రమోహన్, అక్బర్ బాషా తదితరులు పాల్గొన్నారు.


రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

బిల్లు దారుణం..



వక్ఫ్ ఆస్తులపై పెట్టిన బిల్లుకు బీజేపీ, టీడీపీ ఎంపీలు ఆమోదం తెలపడం దారుణం. డాక్యుమెంట్ లేవని, పట్టాలు లేవని నెపంతో సవరణలు చేసి ముస్లింలకు తీవ్ర ఇబ్బందికి గురిచేస్తున్నారు. ఈ నిర్ణయం వెనక్కి తీసుకోవాలి.

– భవిరి కృష్ణమూర్తి,
సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి

సవరణ తగదు..



తరతరాలుగా ఉన్న భూముల్ని ముస్లింల అభివృద్ధికి ఇచ్చే వక్ఫ్ ఆస్తులను కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో బిల్లు పెట్టి సవరించడం దారుణం. ముస్లిం పెద్దలను సంప్రదించకుండా ఏకపక్ష నిర్ణయాలతో కేంద్రం మరోసారి ముస్లింలను మోసగించే ప్రయత్నం చేస్తోంది. ఇటువంటి నిర్ణయాలపై మరోసారి పునరాలోచన చేయాలి.

– బాడాన దేవభూషణరావు, శ్రీకాకుళం

ఆలోచన విరమించుకోవాలి..



వక్ఫ్ కమిషనర్లను తొలగించి వారి స్థానంలో కలెక్టర్లను అధికారిక సర్వేయర్లుగా చేస్తూ సవరణ తీసుకురావడం శోచనీయం. ప్రభుత్వం నేరుగా కలెక్టర్ల ద్వారా వివాదాస్పద వక్ఫ్ భూమిని నిర్ధారించే అధికారాన్ని పొందడం సరికాదు.

– మహిబుల్లాఖాన్,
జామీయా మసీదు అధ్యక్షుడు, శ్రీకాకుళం

ఆస్తులపై ప్రభుత్వాల కన్ను..



వక్ఫ్‌బోర్డు ఆస్తుల్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేతుల్లోకి తీసుకోవాలని చూటడం సరికాదు. ముస్లింలను సర్వనాశనం చేయడమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యంగా కనిపిస్తోంది.

– వి.జి.కె మూర్తి,
జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు

సవరణ దుర్మార్గం..



వక్ఫ్‌బోర్డు ఆస్తుల బాధ్యత కలెక్టర్లకు అప్పగించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆ ఆస్తులతో రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేయాలనుకుంటున్నాయి. బీజేపీ, టీడీపీ ప్రభుత్వాలు ముస్లింల జీవితాలతో ఆటలాడుకునేలా బిల్లులు సవరిస్తున్నాయి.

– రౌతు శంకరరావు,
వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు

కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ

ఎచ్చెర్ల: కలకత్తా ఘటనకు నిరసనగా మండలంలోని ధర్మవరం గ్రామంలో శుక్రవారం సాయంత్రం కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో యువకులు, విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరై నివాళులర్పించారు. పాశవికంగా ప్రవర్తించిన దోషులను కఠినంగా శిక్షించి, కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని కోరారు. మహిళలు, బాలికలపై జరుగుతున్న ఇటువంటి దారుణ ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకోవాలని, పటిష్టమైన చట్టాలను అమలు చేయాలని నినాదాలను చేశారు. ఈ సందర్భంగా మేముసైతం స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధి టీకే ఆచారి మాట్లాడుతూ.. దేశం సిగ్గుపడేలా మానవ మృగాలు సాగిస్తున్న ఇటువంటి పైశాచిక దాడులను ప్రతీ ఒక్కరూ ఖండించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, యువత పాల్గొన్నారు.

అక్లైటిక్ జ్యూయలరీ దుకాణం ప్రారంభం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్రీకాకుళం ప్రజల అభిరుచులకు అనుగుణంగా, అన్నివర్గాలవారూ ధరించే ఆభరణాలు షాప్ 'అక్లైటిక్' అని స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. సౌత్ ఇండియాలోనే తొలి బ్రాంచ్ శ్రీకాకుళం నగరంలో ప్రారంభించడం ఎంతో సంతోషదాయకమన్నారు. శ్రీకాకుళం జీటీ రోడ్డులో అక్లైటిక్ జ్యూయలరీ షాపును శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అన్నివర్గాల వారికీ అందుబాటులో ఉండే ధరల్లో ఇక్కడ ఆభరణాలు ఉండడం అభినందనీయమన్నారు. అక్లైటిక్ ఫ్రాంచైజర్ కింతలి గోవిందరావు మాట్లాడుతూ.. 100 శాతం సిల్వర్ మీద గోల్డ్ ప్లేటెడ్ జ్యూయలరీ దుకాణం ఇదని చెప్పారు. ఇక్కడ రూ. వెయ్యి నుంచి రూ. రెండు లక్షల వరకు విలువ చేసే ఆభరణాలు లభిస్తాయన్నారు. శనివారం నుంచి సోమవారం వరకు ప్రత్యేక ఆఫర్లు ఉన్నాయని.. వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, హీరో ఎండీ అంధవరపు ప్రసాద్, సంతోష్, పి.సూరిబాబు, ఉన్న నాగరాజు, పేర్ల సాంబమూర్తి పాల్గొన్నారు.


అక్లైటిక్ జ్యూయలరీ దుకాణాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

నేడు పీఆర్‌టీయూ జిల్లాశాఖ భవనం ప్రారంభం

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రొగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ (పీఆర్‌టీయూ)ఏపీ శ్రీకాకుళం జిల్లాశాఖ నూతన కార్యాలయ భవనం ఆదివారం ప్రారంభంకానుంది. అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి సన్నిధికి సమీపంలో కోనేరుకు ఆవల వైపు మూడు అంతస్తుల్లో భవనాన్ని నిర్మించారు. ఉదయం పది గంటలకు జరగనున్న ప్రారంభోత్సవ కార్యక్రమానికి కేంద్రమంత్రి కె.రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రి కె.అచ్చెన్నాయుడు, జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, ఇతర ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు మిట్టా కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి ఏఎం గిరిప్రసాద్ హాజరవుతారని పీఆర్‌టీయూ జిల్లాశాఖ అధ్యక్షుడు తంగి మురళీమోహనరావు, ప్రధాన కార్యదర్శి దానేటి కేశవరావు తెలిపారు.



పీఆర్‌టీయూ నూతన భవనం

ఉత్సాహంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు


శ్రీకాకుళం కల్చరల్: శార్వాణి పాఠశాలలో ఉట్టి కొట్టే ఉత్సవంలో విద్యార్థులు


జి.సిగడాం: కృష్ణాష్టమి వేడుకలలో చిన్నారులు

శ్రీకృష్ణాష్టమి వేడుకలను ముందస్తుగా పాఠశాలల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. పిల్లలు కృష్ణుడు వేషంలో అలరించారు. ఉట్టికొట్టే ఉత్సవంలో విద్యార్థులు ఆనందంగా పాల్గొన్నారు.

యూరియా కొరతపై దృష్టిసారించాలి

- మండల సమావేశంలో సభ్యులు డిమాండ్
- సమన్వయంతో పనిచేయాలి: ఎమ్మెల్యే గొండు శంకర్


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొండు శంకర్

గార: మండలంలో యూరియా కొరత ఉందని, రైతులకు అందుబాటులో ఉంచాలని పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు కోరారు. శనివారం ఎంపీపీ గొండు రఘురామ్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఇందులో పాల్గొన్న ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ.. యూరియా కొరతపై ఎప్పటికప్పుడు చెప్పాలని, ఉన్నతాధికారులతో మాట్లాడి అందుబాటులోకి తెస్తామన్నారు. కౌలు రైతుల ఎంపికలో ఇబ్బంది ఉందని తూలుగు సర్పంచ్ కొయ్యాన నాగభూషణం తెలియజేయగా, దీనిపై విధివిధానాలు కొత్తగా వస్తాయని, ఈలోగా వ్యవసాయం చేసిన ప్రతీ కౌలు రైతును గుర్తించాలని అధికారులకు ఆదేశించారు. శివారు ప్రాంతాలకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. 2014–19లో కొందరికి ఒక్క రూపాయి వేసి కాలనీలు మంజూరు చేశారని, వారికి బిల్లులు అందేలా చర్యలు తీసుకోవాలని రామచంద్రాపురం సర్పంచ్ గొలివి రమణమూర్తి కోరారు. జగనన్న కాలనీల్లో అసంపూర్తిగా ఉన్న ఇళ్లు పూర్తి చేసే బాధ్యత సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు తీసుకోవాలని, బిల్లులు మరో నాలుగు నెలల్లో అందేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే శంకర్ తెలిపారు. రామచంద్రాపురంలో నివాసస్థలం కాకపోవడంతో గ్రామం దగ్గరికి స్థలం మార్పు చేశామని, వారికి ఇళ్లు మంజూరు చేయాలని సర్పంచ్ జీవీ రమణమూర్తి, ఎంపీటీసీ సభ్యుడు రుప్ప శ్రీను కోరారు. బైరిదేశిగెడ్డ శివారు ప్రాంతాలకు సాగునీరు అందడం లేదని.. సమస్యను పరిష్కరించాలని సర్పంచ్ పీస శ్రీహరిరావు కోరారు. వంశధార అధికారులు మినహా నారాయణపురం, బైరిదేశిగెడ్డ అధికారులు హాజరుకాలేదు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశాలు ఉండటం వలన పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని, పీహెచ్‌సీల్లో మందులు అందుబాటులో ఉంచాలని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు, అధికారులు పాల్గొన్నారు.

జేఆర్‌పురం ఎస్‌ఐగా చిరంజీవి



రణస్థలం: జే.ఆర్.పురం పోలీస్‌స్టేషన్ ఎస్సైగా ఎస్.చిరంజీవి విధుల్లో చేరారు. ఆయన ఎచ్చెర్ల పోలీస్‌స్టేషన్ నుంచి జే.ఆర్.పురం బదిలీపై వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన ఎస్‌ఐ కూన గోవిందరావు శ్రీకాకుళం వీఆర్‌కి వెళ్లారు.

పందులు, పశువులను ఖాళీ స్థలాల్లో పెంచుకోవాలి


మాట్లాడుతున్న సుధీర్‌కుమార్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): నగరంలో విచ్చలవిడిగా రోడ్లపై, జనావాసాల మధ్యలో తిరుగుతున్న పందులు, పశువులను సంబంధిత యజమానులు ఖాళీ స్థలాల్లో పెంచుకోవాలని.. లేకుంటే కఠిన చర్యలు తప్పవని కార్పొరేషన్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పి.సుధీర్‌కుమార్ అన్నారు. శ్రీకాకుళం నగరపాలక సంస్థ కార్యాలయంలో పందులు, పశువుల యజమానులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారితో మాట్లాడుతూ..యజమానుల తీరుమారకపోతే రోడ్లపై తిరుగుతున్న పశువుల్ని పట్టుకుని సుదూర ప్రాంతాల్లో విడిచిపెడతామని హెచ్చరించారు. అంతేకాకుండా జరిమానా వేస్తామన్నారు. సమావేశంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

కవితా పురస్కారానికి పంచరాన ఎంపిక


భుజంగరావు

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం పట్టణానికి చెందిన కంచరాన భుజంగరావు పల్లా జాతీయ కవితా పురస్కారం–2024కు ఎంపికయ్యారు. ఈ విషయాన్ని ఆయన శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 26వ తేదీన వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరులో యువ సాహితీ సేవా సంస్థ అవార్డును ప్రదానం చేయనుంది. తాను రచించిన 'నీటి గింజల పంట' వచన కవితలుకి ఎంపికైనట్లు తెలిపారు.

ఎస్సీల వర్గీకరణ తీర్పుపై ఇంప్లీడ్ రివ్యూ పిటీషన్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పునఃసమీక్షించాలని కోరుతూ అంబేడ్కర్ ఇండియా మిషన్ తరఫున ఇంప్లీడ్ రివ్యూ పిటీషన్‌ను దాఖలు చేసినట్లు రాష్ట్ర ఉపాధ్యక్షులు తైక్వాండో శ్రీను తెలిపారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. న్యూఢిల్లీ వెళ్లి సుప్రీంకోర్టును ఆశ్రయించి న్యాయపోరాటం చేస్తామని చెప్పారు. పి.వి.సునీల్ కుమార్ ప్రోత్సాహంతో ఏఐఎమ్ ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాటం సాగిస్తుందని పేర్కొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామికి పూజలు

శ్రీకాకుళం కల్చరల్: మొండేటివీధిలోని వేంకటేశ్వర స్వామికి శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు, అలంకరణ జరిగాయి. అర్చకులు పట్నాల రామకృష్ణ శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో సుప్రభాతసేవ, అష్టోత్తరశతనామాలచే భక్తుల గోత్రనామాలతో పూజలు చేశారు. సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణలు జరిగాయి. అలాగే నారాయణ తిరుమలలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో, చిన్నబజారులోని దూదివారివేంకటేశ్వర స్వామికి కూడా ప్రత్యేక పూజలు జరిగాయి. డీసీసీబీ కాలనీలో భూసమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో, బ్యాంకర్స్‌కాలనీలోని వేంకటేశ్వరనికి పూజలు నిర్వహించారు.

హరినామ సంకీర్తన

నగరంలోని కలెక్టర్ బంగ్లా వద్దగల కల్యాణ వేంకటేశ్వర స్వామి కమిటీ సభ్యులచే శనివారం సందర్భంగా నగరవీధులలో హరినామ సంకీర్తనలు జరిగాయి. అర్చకులు వంశీకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో సుప్రభాతసేవ, అష్టోత్తరశతనామాలచే భక్తుల గోత్రనామాలతో పూజలు చేశారు. ఆలయ సభ్యులు మర్రి యోగేశ్వరరావు, బెహరా నాగేశ్వరరావు ఉన్నారు.


మొండేటివీధిలో పూజలందుకున్న స్వామివారు

సర్దుబాటు గందరగోళాన్ని సరిచేయండి


డీఈఓ తిరుమల చైతన్యకు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: పాఠశాలల్లో ఉపాధ్యాయులకు చేపడుతున్న వర్క్ అడ్జిస్ట్‌మెంట్ గందరగోళాన్ని వెంటనే సరిచేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి లండ బాబూరావు, బి.శ్రీరామ్మూర్తి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కూటమి ప్రభుత్వ అధికారంలోకి రాకముందు 117 జీవోని రద్దు చేస్తామని హామీ ఇచ్చిందని.. ఆ హామీ ప్రాప్తికి జీవోను రద్దుచేసి, జీవో నంబర్ 53 ప్రకారం వర్క్ ఎడ్జిస్ట్‌మెంట్ ప్రక్రియను చేపట్టాలని యూటీఎఫ్ శ్రీకాకుళం జిల్లాశాఖ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ సదాశివుని తిరుమల చైతన్యను శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. హై స్కూళ్లలో స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉంటే ప్రమోషన్ ద్వారా భర్తీ చేయాలి తప్పిస్తే.. మెథడాలజీ పేరుతో ఎస్జీటీలను పంపించడం గందరగోళానికి దారితీస్తుందన్నారు. డివిజన్ స్థాయికి ఎస్జీటీలను పంపించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారని.. ఈ ప్రక్రియను అధికారులు వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. డీఈవోను కలిసిన వారిలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చౌదరి రవీంద్ర, జిల్లా కార్యదర్శులు సూర స్వర్ణకుమారి, జిసురేష్, కోశాధికారి రవికుమార్, రాష్ట్ర కౌన్సిలర్ పొందూరు అప్పారావు, రెడ్డి త్రినాథరావు, బి.పురుషోత్తం, ధనుంజయరావు ఉన్నారు.